కథానిక ◆ నవీన్

"మళ్ళా ఎన్నాళ్ళకొస్తవ్ కొడుకా" అంది వెంకటమ్మ పట్నం వెళ్ళిపోవడానికి తయారవుతున్న కొడుకును కళ్ళనిండా చూసుకుంటూ.

"ఆర్నెళ్ళు పట్టది. బాగా చదివి పరీక్షలు రాయాలె. గిట్ల నాల్గు రోజులకోసారి వచ్చి పోతుంటే చదువెట్లయితది" అన్నాడు వేణు తన పుస్తకాలన్నీ ఓ సంచీలో సర్దుకుంటూ.

"ఆర్నెళ్ళదాక రావా? వరంగల్లేపాటి దూరముంది? మద్దెనోపాలి వచ్చిపోతే యేమైతది" అంది వెంకటమ్మ.

"యేం కాదు, నా చదువు పాడైతది. చదవొద్దు, పరీక్ష రాయొద్దు, ఊళ్ళనే ఉండి కూలి పనికి పొమ్మంటే పోత" అన్నాడు వేణు విసుగ్గా.

"నిన్నిప్పుడు కూలిపనెవరు జెయ్యమన్నరు? ఎన్ని కష్టాలైనా పడి నిన్ను చదివిపిస్తమని చెప్పినం గదా."

"అన్యాయం గాదా?"

"అన్యాయమే. మేం ఎన్నోసార్లు ప్రిన్స్‌పాల్ నడిగినం. క్లాసులు బాయ్‌కాట్ చేసినం. కానీ, ఏం లాభం? పైకి రానిస్తనంటడు. ట్రాన్స్‌ఫర్ చేయిస్త నంటడు. ట్రాన్స్‌ఫర్ చేయిస్తే మాత్రం వాళ్ళు పోతరా? ఎవ్వన్నో నాయకున్ని పట్టుకుంటరు.

# ఆర్నెల్లదాకా రాను



**సమాజం మీద అసహనం పెంచుకున్న ఓ పేదింటి కుర్రాడికి విప్లవం చుక్కానిగా కనిపించింది. మరి అతని ప్రయాణం ఎలా సాగింది?**

"గందుకే చెబుతాన నన్ను ఆర్నెళ్ళదాక వదిలిపెట్టుండ్రి అని. పరీక్ష రాసినంకనే నేను మళ్ళొస్త." పుస్తకాలూ, బట్టలు సర్దుకొని వేణు లేచి నిల్చొని, "నేను పోయొస్తనే అవ్వా" అన్నాడు.

"నిజంగనే ఆర్నెళ్ళదాక రావా?"

"రాను. ఆర్నెళ్ళ తర్వాతొస్తే అదే అదృష్టమను కోండ్రి" అంటూనే వేణు ఇంట్లోంచి బయటకొచ్చి వేగంగా బస్సు స్టాప్ వైపు నడవసాగాడు.

అమ్మను వదిలేసి రావడం బాధే. ఆమెకు తాను తప్ప ఇంకెవరూ లేరు. నాన్న తన ఊరి దొర దగ్గర జీతం ఉండేవాడు. రెండేళ్ళ క్రితమే దొర పని మీదే మర్రి చెట్టెక్కి కొమ్మలు నరుకుతూ కాలు జారి కింద పడిపోయి చనిపోయాడు. అయినా, దొర తన కుటుంబాన్ని ఏ విధంగానూ ఆదుకోలేదు. పైగా, ఆయన అప్పింకా తీర లేదని, ఆ అప్పు కింద తనను ఆయన దగ్గర జీతముంచాలని పట్టుబట్టాడు. అప్పుడే పట్నంలో ఉండే తన మేనమామొచ్చి, "ఎట్టి పరిస్థితిల్లోనూ మావాడ్ని మీ దగ్గర జీతముంచేది లే"దని కచ్చితంగా చెప్పేసి తనను వరంగల్ తీసికెళ్ళి హైస్కూల్లో చేర్పించాడు. మేనమామ కనకయ్య వరంగల్‌లోని ఓ రైస్ మిల్లులో పనిచేస్తాడు. తనప్పటికే తన ఊరి హైస్కూల్లోనే టెన్త్ చదువుతున్నాడు. వరంగల్ వెళ్ళాక తన ప్రపంచం చాలా విశాలమైపోయింది. మేనమామ ఇంట్లోనే ఉంటూ టెన్త్ ప్యాసయి ఇంటర్‌లో చేరాడు. వరంగల్‌కు, తన ఊరికి చాలా దగ్గరే కాబట్టి ప్రతివారం తన ఊరికి వెళ్ళొస్తుండేవాడు.

ఇంటర్‌లో జాయినయిన కొద్ది రోజుల తర్వాత ఓ రోజు లెక్చరర్ రాకపోవడం వల్ల క్లాసు లేకపోతే ఒక్కడే వెళ్ళి లైబ్రరీలో కూర్చున్నాడు. అక్కడే ఉన్న రాజేందర్ అనే తన సీనియర్ తనకేసి చాలా సేపు చూసి, "నువ్వు ఫస్టియర్ ఎం.పి.సీలో ఉన్నావు కదూ" అన్నాడు. "అవును" అన్నాడు తను.

"ఇప్పుడు క్లాసు లేదా" అన్నాడు రాజేందర్.

"లేదు. ఇంగ్లీషు సార్ రాలేదు" అన్నాడు తను.

"ఆ ఇంగ్లీషు సారు ఎప్పుడూ రాడు. లెక్కల సార్ కూడా రాడు. ట్యూషన్లు చెప్తుతరు, కాలేజీలల్ల చెప్పరు. వానికింత లంచమిస్తరు. ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ చేయించుకుంటరు" అన్నాడు రాజేందర్.

"గట్లయితే ఎట్లమరి? ఈ దేశం ఎట్ల బాగు పడాలె?" అన్నాడు తను.

"మీదేవూరు?"

"వెంకటాపురం. ఇక్కడికి దగ్గరే."

"మీ అమ్మ, నాయన యేం జేస్తరు?"

"మా నాయన మా ఊరి దొర దగ్గర జీతముండే టోడు. చెట్టు కొట్టబోయి జారిపడి చచ్చిపోయిండు."

"మీ ఊరి దొరంటే వెంకట్ రెడ్డేనా?"

"వెంకటరెడ్డే. నీకెట్ల తెలుసు?"

"మాకీ చుట్టుపక్కలూర్ల దొరలందరు తెలుసు. మీ నాయన దొరపని మీదనే చెట్టెక్కి జారిపడి చచ్చిపోయినా మీ దొర మీకేం ఇయ్యలేదు కదూ?"

"అవును. పైగా పాత బాకీ కింద నన్ను కూడా ఆయన దగ్గర జీతముండమన్నడు. మా కనకయ్య మామ అడ్డుపడకపోతే నన్నసలు వదిలేవాడే కాదు" అన్నాడు తను.

"మీ ఊర్లె మీ అమ్మొక్కతే ఉంటదా?"

"మా యిద్దరక్కలు కూడా మా ఊళ్ళనే ఉంటరు."

"రాజూ సాయంత్రంపూట యేం జేస్తవు నువ్వు?"

"యేం లేదు. ఊకనే ఉంట. నాకీ ఊళ్ళె ఎవ్వరు దోస్తులు కూడా కాలేదు."

"మేమందరం నీ దోస్తులమే. ఈ రోజు నుంచి రోజూ సాయంత్రం మా ఇంటికి రా. అసలు నువ్వుండేదెక్కడ చెప్పు?"

"నయీం నగర్‌ల."

"అయితే మా ఇంటికి మీ ఇల్లు చాలా దగ్గర. యూనివర్సిటీ గేటుకు ఆపోజిట్‌గా ఉండే రోడ్డు దగ్గరకు రా. నేను కూడా అక్కడ్నే ఉంటా. ఈ రోజు సాయంత్రం ఆరు గంటలకు నీకోసం నేనక్కడ వెయిట్ చేస్తుంటా" అన్నాడు రాజేందర్.


తన మీద అంత ఇంటరెస్ట్ చూపించిన రాజేందర్ తనకు నచ్చాడు. అతనితో స్నేహం చెయ్యాలనిపించింది. అతడు రమ్మన్న చోటికి వెళ్ళాలనిపించింది. ఆ రోజు సాయంత్రం అలాగే వెళ్ళాడు. రాజేందర్ తనకోసమే వెయిట్ చేస్తున్నాడు. తనను మోటారు సైకిలెక్కించుకొని చాలా దూరం తీసికెళ్ళాడు. ఊరికి మారుమూలన ఉన్న ఓ పెంకుటిల్లు ముందు ఆపాడు. తలుపు మీద మూడుసార్లు అదోమాదిరిగా చప్పుడు చేశాక తలుపులు తెరుచుకున్నాయి.

"ఇక్కడ మన దోస్తులు చాలామందున్నరు. నిన్ను వాళ్ళందరికి పరిచయం చేస్త. రా లోపలకు" అన్నాడు రాజేందర్.

తను లోపలకెళ్ళగానే తలుపులు మూసేశారు.

లోపల తన వయసువాళ్ళే ఆరుగురున్నారు. రాజేందర్ తనను వాళ్ళకు పరిచయం చేశాడు.

"ఈయన వేణుగోపాల్. మన పక్కూరే. ఇంటర్



చిత్రాలు: నర్సిం

ఫస్టియర్ చదువుతున్నాడు."

వాళ్ళంతా తనను పరియం చెయ్యగానే, "లాల్ సలామ్ కామ్రేడ్" అన్నారు. తనూ తనకు తెలియకుండానే "లాల్ సలామ్ కామ్రేడ్స్" అనేశాడు. వాళ్ళందర్నీ తనకు పరిచయం చేశారు. అందరూ ఇంటరో లేక డిగ్రీయో చదువుతున్న వాళ్ళే. సోమయ్య, సారయ్య, రాజయ్య, మురళీధర్, రహమాన్, రమేష్... వాళ్ళందరూ తనకు మంచి ఫ్రెండ్స్యిపోయారు.

"సారింకా రాలేదా?" అన్నాడు రాజేందర్.

"రాలేదు" అన్నాడు సారయ్య.

కొంచెంసేపు వెయిట్ చెయ్యగానే బయట తలుపు చప్పుడైంది. సరిగ్గా రాజేందర్ మూడుసార్లు ఎలా చప్పుడు చేశాడో ఇప్పుడు అలాగే మూడుసార్లు చప్పుడైంది. రాజేందర్ వెళ్ళి తలుపు తీశాడు. తమ వయసులోనే ఓ యువకుడు, అతనితోపాటే ఓ యాభైయేళ్ళ పెద్దమనిషి లోపలకొచ్చారు. సారంటే ఈయనే కాబోలు అనుకున్నాడు తను. తెల్ల లాల్చీ, పైజమా వేసుకున్నాడు. చంకన ఓ సంచీ వేళ్ళాడుతుంది. మనిషి చాలా పొడుగ్గా ఉన్నాడు. చామన ఛాయ. గుబురుగా పెరిగిన గడ్డం. చూడగానే గౌరవం కల్గించే రూపం అతనిది.

"వీరు లక్ష్మీపతిగారు. మన టీచర్. చాలా కాలంగా వీరు మన యూనియన్ మెంబర్స్‌కు క్లాసులు తీసుకుంటున్నారు. ఈ రోజు నుంచి వరసగా పదిహేను రోజులపాటు వీరు ప్రతిరోజూ ఇదే టైమ్‌కు క్లాసులు తీసుకుంటారు" అన్నాడు రాజేందర్. అందరూ నిశ్శబ్దంగా లక్ష్మీపతి గారి కేసి చూస్తుండగా లక్ష్మీపతి మొదలెట్టాడు.

"కామ్రేడ్స్, మీరంతా యువకులు. ఉడుకు రక్తం కల్గిన వాళ్ళు. ఈ దేశంలో యేమైనా విప్లవాత్మకమైన మార్పులు జరగాలంటే అది మీవల్లనే సాధ్యమౌతుంది. మనమిప్పుడు ఎలాంటి వాతావరణంలో జీవిస్తున్నామో చూడండి. మన సంఘం కుళ్ళిపోయింది. మన రాజకీయ వ్యవస్థ కుళ్ళిపోయింది. మన విద్యావ్యవస్థ కుళ్ళిపోయింది. మన పరిపాలనా వ్యవస్థ కుళ్ళిపోయింది. ఎన్ని స్కాములో చూడండి. ఎన్ని అక్రమాలో చూడండి. ఇది ఉన్న వాడి రాజ్యం. ఉన్నవాడు లేనివాడిని ఎన్ని విధాలుగా దోచుకుంటున్నాడో చూడండి. మన దేశాన్ని మన పాలకులు ఎప్పుడో ఐ.ఎం.ఎఫ్‌కూ, ప్రపంచ బ్యాంక్‌కూ, బహుళ జాతి గుత్తాధిపతులకు అమ్మేశారు. మనమేమన్నా అంటే పోలీసులు, లాఠీలు, తుపాకులు మన మీదకు గురిపెడ్తున్నారు. ఇది బూటకపు ప్రజాస్వామ్యం. మాట వరసకే మనల్ని మన సమస్యల్ని చెప్పుకోమంటారు. కానీ, మన సమస్యల్నెవడూ తీర్చడు. ఇది ఉన్న వాళ్ళ రాజ్యం."

ఈ ధోరణిలో సార్ చాలాసేపు మాట్లాడాడు. సార్ చెప్పిన ప్రతిమాటా నిజమే. వింటున్నంతసేపూ తను ఆవేశంలో కొట్టుకుపోయాడు. ఓ గంట సేపు

"రాను. ఆర్నెళ్ళ
తర్వాతొస్తే అదే
అదృష్టమనుకోండ్రి"
అంటూనే వేణు
ఇంట్లోంచి బయటకొచ్చి
వేగంగా బస్సు స్టాప్
వైపు నడవసాగాడు.

మాట్లాడాక లక్ష్మీపతి తన క్లాసును ముగిస్తూ, "సాయుధ విప్లవం తప్ప ఈ దేశం బాగుపడాలంటే మరో మార్గం లేదు. హింసకు ప్రతి హింసే సమాధానం. తుపాకి గొట్టంలోంచే రాజ్యాధికారం సంక్రమిస్తుంది. మనం మన శ్రమ జీవుల రాజ్యాన్ని స్థాపించినప్పుడే ఈ అన్యాయాలు నశించిపోతాయి. మనం సమసమాజాన్ని స్థాపిస్తాం. కాబట్టి ఈనాడు అణగదొక్కబడ్తున్న మీలాంటి వాళ్ళందరూ సమైక్యం కావాలి. దళితులు, బలహీనవర్గాలవాళ్ళు, అణగదొక్కబడినవాళ్ళు అందరూ యేకం కావాలి. ప్రజా సైన్యాన్ని స్థాపించాలి. ఇప్పుడు సాగుతున్న గెరిల్లా పోరాటాన్ని ఇంకా ఉధృతం చేయాలి. అందుకు యువకులైన మీరంతా సిద్ధం కావాలి. మీరు సిటీలోనే ఉంటూ విద్యార్థుల్ని ఆర్గనైజ్ చెయ్యాలి. కొంత కాలం తర్వాత మిమ్మల్ని దళాళ్ళోకి పంపిస్తాము. అంతవరకు సిటీలోనే కొన్ని బాధ్యతల్ని అప్పగిస్తాం. మీకప్పగించబడిన పనుల్ని జాగ్రత్తగా చేస్తుండండి. లాల్ సలామ్" అంటూ లక్ష్మీపతి ముగించాడు.

తర్వాత సారయ్య కొన్ని పాటలు పాడాడు.

తర్వాత రాజేందర్ ఏయే కాలేజీలలో ఏయే సమస్యలున్నాయో వాటినెలా ఎదుర్కోవాలో చెప్పాడు.

ఆ రోజు నుంచి తను ప్రతి రోజూ ఆ ప్రదేశాని కెళ్తున్నాడు. తనకు చాలా విషయాలు తెలిశాయి. తన చైతన్య పరిధి విస్తరించింది. ఇంతకాలం తనెంత అజ్ఞానంలో ఉన్నాడో అర్థం చేసుకున్నాడు. అకలితో, అణచివేతలో, అవమానంతో చచ్చేకంటే పోరాటంలో చావడం ఎంతో మేలు అని సార్ పదేపదే చెప్పిన మాటను తను పూర్తిగా నమ్మాడు. మూడు నెలల తర్వాత తనకు చిన్నచిన్న పనులు చెప్పడం మొదలెట్టారు.

కొన్ని లెటర్స్, విప్లవ సాహిత్యం ఉన్న బ్యాగ్స్‌ని ఫలానా చోట ఫలానా గుర్తులున్న ఇంట్లో ఫలానా కోడ్ గుర్తులతో అక్కడుండే వ్యక్తిని గుర్తుపట్టి ఇచ్చి రమ్మని పంపిస్తుండేవాళ్ళు. తను సరిగ్గా వాళ్ళు చెప్పినట్లే చేస్తుండేవాడు. తనకు శేఖర్ అనే మరోపేరు కూడా పెట్టి తనను శేఖరుగానే వ్యవహరిస్తుండేవాళ్ళు. ఫలానా షాపుకెళ్ళి ఫలానా పేరు చెప్తే ఆ షాపు వాళ్ళు కొంత డబ్బిస్తారని, ఆ డబ్బు మూడో కంటికి కనిపించకుండా తీసుకు రమ్మని కూడా తనను పంపిస్తుండే వాళ్ళు. ఇలా మరో మూడు నెలలు గడిచిపోయాయి. ఆ తర్వాత తనకు ఇంకా ముఖ్యమైన పనులు చెప్పడం మొదలెట్టారు. లక్ష్మీపతి సార్ తనకూ, సారయ్యకు పిస్టల్ షూటింగ్ నేర్పించాడు. అయిదారు రోజులు ప్రాక్టీస్ చెయ్యగానే తనకు పిస్టల్ షూటింగ్ వచ్చేసింది. పిస్టల్ షూటింగ్ రావడంతో తను చాలా ఇంపార్టెంట్‌గా ఫీలయ్యాడు. యూనియన్‌లో కూడా తన ఇంపార్టెన్స్ పెరిగింది. తను అయిదారు రోజులకొకసారి కూడా కాలేజీకి వెళ్ళేవాడు కాదు. అప్పుడప్పుడు తన ఊరి కెళ్ళి అమ్మను చూసొస్తుండేవాడు.

ఒకరోజు రాజేందర్ తనను పిలిచి, "నువ్వు మాటిమాటికి మీ ఊరెళ్ళకూడదు" అన్నాడు.

"నేను కనబడకపోతే మా అవ్వ బెంగపెట్టుకుంటుంది."


"నిజమే. మనం ఈ ఉద్యమంలోకొచ్చామంటే అవ్వ, అయ్య, అక్క, చెల్లె- అందర్నీ మరిచిపోవాలే. మనకు వ్యక్తిగత బాంధవ్యాలు గానీ, వ్యక్తిగత సమస్యలుగానీ ఉండకూడదు. మనం ఏం చేసినా ప్రజలకోసమే, సమూహాలకోసమే, సమాజం కోసమే కాబట్టి నువ్వీసారి వెళ్ళినప్పుడు మీ అవ్వతో చెప్పు మరో ఆరు నెలలదాకా రానని. నీకు కొన్ని ముఖ్యమైన బాధ్యతల్ని అప్పగించబోతున్నాము" అన్నాడు రాజేందర్.

తను "గట్లనే చెప్పొస్త" అన్నాడు.

అందుకే ఈసారి అవ్వతో మరో ఆర్నెల్లదాకా రానని చెప్పేశాడు. అవ్వకు తనేం చేస్తున్నాడో తెలీదు. తెలిస్తే భయంతో హడలిపోతుంది. గుండాగి చచ్చిపోయినా అశ్చర్యం లేదు.

* * *

"ఈసారి నీకు చాలా ముఖ్యమైన పని అప్పగిస్తున్నాము. నువ్వూ, సారయ్యా శివాజీ నగర్‌లో ఉండే నరసింహస్వామి అనేవాడి ఇంటిమీద ఓ కన్నేసి ఉంచండి. ఓ వారం రోజులు వాడింటికి ఎవరొస్తున్నారో, ఎవరు వెళ్తున్నారో, ఏ టైమ్‌లో వాడు పూర్తిగా ఒంటరిగా ఉంటాడో గమనించండి. వారం రోజుల తర్వాత వాడు ఒంటరిగా ఉండే టైమ్ చూసుకొని వాడింట్లోకెళ్ళి వాడిని ఫినిష్ చెయ్యండి. వేణూ, నువ్వు బయట ఉండు. సారయ్యా, నువ్వు లోపలకెళ్ళి ఈ పిస్టల్‌తో వాడిని చాలా



దగ్గర్నుంచి వాడి కణతల మీద మూడు సార్లు కాల్చేయ్. ఎట్టి పరిస్థితుల్లోనూ వాడు బతక కూడదు. పని పూర్తిచేసుకొని గప్‌చుప్‌గా మీరు బయటకొచ్చేసి ఏమీ తెలియనట్లు మీ సైకిళ్ళమీద రోడ్డుమీదకొచ్చి జనంలో కలిసిపోండి" అన్నాడు రాజేందర్.

ఒక్కసారి తన గుండెలు వణికాయి. తనింత వరకూ ఓ మనిషిని చంపేంత సాహసం చెయ్యలేదు.

"ఈ నరసింహస్వామి అనేవాడు ఎవడు? వాడినెందుకు చంపాలని ఆలోచిస్తున్నారేమో. వాడో నరరూప రాక్షసుడు. వాడు పదవిలో ఉన్న కాలంలో ఎంతమంది అమాయకులను చంపించాడో లెక్కలేదు. తనకు అడ్డొచ్చినవాళ్ళందరినీ చంపించి మినిస్టరై కోట్లకు కోట్లు రూపాయలు సంపాదించి వాడి పిల్లలందర్నీ అమెరికా పంపించాడు. వాడిప్పుడు ఒక్కడే ఇక్కడ ఉంటున్నాడు. ఎనభై ఏళ్ళొచ్చినా వాడింకా పైరవీలు చేస్తూనే ఉన్నాడు. లంచాలు తీసుకొంటూనే ఉన్నాడు. వాడు ముఖ్యమంత్రికి చాలా దగ్గర. వాడిని చంపితే ముఖ్యమంత్రి మొరేల్ దెబ్బ తింటుంది. అందుకే పార్టీ వాడిని ఫినిష్ చెయ్యాలని నిర్ణయించింది. ఆపనికి మన అండర్‌గ్రౌండ్ కేడర్ అక్కర్లేదు. ఆ పనిని మన స్టూడెంట్ వింగ్‌కు అప్పగించాలని నిర్ణయించారు. అందుకే మీకప్పగిస్తున్నాము" అన్నాడు రాజేందర్.

తను రాజేందర్ చెప్పినట్టే చేశాడు. సారయ్య, తనూ కలిసి ఆ ఇంటిమీద ఓ వారం రోజులు కన్నేసి ఉంచారు. రోజూ ఉదయం ఏడింటికి నరసింహస్వామి ఒక్కడే వాకింగ్‌కు మేడమీద నుంచి కిందకొచ్చి తన ఇంట్లోని లాన్‌లోనే అటూ ఇటూ ఓ అరగంటసేపు తిరుగుతాడు. వాడి వంటమనిషి లోపలే వంటచేస్తూ ఉండిపోతాడు. వాడిని ఫినిష్ చెయ్యడానికి ఉదయం ఏడు, ఏడున్నర బెస్ట్ టైమ్ అని డిసైడ్ చేశారు. అప్పటివరకు వాడింటికి ఎవరూ రారు.

నరిగ్గా వారం రోజుల తర్వాత తనూ, సారయ్య ఇద్దరూ ఒక్క సైకిల్‌మీదనే సరిగ్గా ఏడింటికి నరసింహస్వామి ఇంటికెళ్ళారు. గేటు దగ్గర వేణుగోపాల్ ఆగాడు. సారయ్య గేటు తీసుకొని లోపలికెళ్ళి అప్పుడే తన గదిలోంచి బయటకు రాబోతున్న నరసింహస్వామిని వాళ్ళ డ్రాయింగ్ రూమ్‌లోనే చాలా దగ్గర్నుంచి మూడుసార్లు కాల్చేసి బయటకొచ్చాడు.

మళ్ళీ ఇద్దరూ సైకిలెక్కి రోడ్డుమీదికొచ్చేసి జనంలో కలిసిపోయారు. ఆరోజు తనూ, సారయ్య మామూలుగా కాలేజీకి కూడా వెళ్ళారు.

నరసింహస్వామి చనిపోయినట్టు బయటి ప్రపంచానికి తెలియడానికి చాలా టైమ్ పట్టింది. మొదలు వాళ్ళ వంటమనిషి పరిగెత్తుకొని వచ్చాడు. తర్వాత వాళ్ళ డ్రైవరొచ్చాడు. పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసులొచ్చారు. ప్రెస్‌వాళ్ళొచ్చారు. నరసింహస్వామి పార్టీవాళ్ళొచ్చారు. బంధువులొచ్చారు, ప్రజలొచ్చారు.

*　　　*　　　*

నరసింహస్వామి హత్య బ్రహ్మాండమైన సంచలనాన్ని సృష్టించింది. పత్రికలన్నీ నరసింహస్వామి జీవిత చరిత్రను ప్రచురించాయి. ఎనభై ఏళ్ళ వృద్ధుణ్ణి హత్య చెయ్యడం అన్యాయమని, అమానుషమని నాయకులు స్టేట్‌మెంట్లిచ్చారు. ముఖ్యమంత్రి వచ్చి శవంమీదపడి బోరుమని ఏడ్చాడు. వారం రోజులదాకా మామూలు మనిషి కాలేకపోయాడు. వారం రోజులు సంతాప దినాల్ని ప్రకటించారు. పూర్తి రాజలాంచనాలతో శవాన్ని దహనం చేశారు.

ఆ తర్వాత ఊర్లో పోలీసు నిఘా ఎక్కువైంది. నరసింహస్వామిని చంపింది విద్యార్థులేనని పోలీసులు పసిగట్టారు. వేణు చదువుతున్న కాలేజీమీద, అతడుండే గదిమీద నిఘా వేసి ఉంచారని వేణుకు తెలియదు. అలాగే సారయ్య ఇంటిమీద కూడా పోలీసులు నిఘా వేశారు.

ఒకరోజు తన గదిలో నిద్రపోతున్న వేణును పోలీసులు అరెస్టు చేశారు. అంతకు ముందే సారయ్యను, రమేష్‌ను పట్టుకున్నారు. రమేష్‌ను టార్చర్ చెయ్యగానే అతడు సారయ్య పేరు, వేణుగోపాల్ పేరు చెప్పేసి, వాళ్ళుండే ఇళ్ళుకూడా చూపెట్టాడు.

పోలీసులు వేణుగోపాల్‌ను, సారయ్యను, రమేష్‌ను జీపెక్కించుకొని పోలీసు స్టేషన్‌కు తీసికెళ్ళి మూడు రోజులు అనేక చిత్రహింసలకు గురి చేశారు. రాజేందర్ ఎక్కడుంటాడో చెప్పమన్నారు. లక్ష్మీపతి ఎక్కడుంటాడో చెప్పమన్నారు. ఇంకా ఎంతోమంది పేర్లు చెప్పి వాళ్ళ అడ్రసులు చెప్పమన్నారు. కరెంట్ షాక్స్ ఇచ్చారు. బోర్లా పడుకోబెట్టి బూటు కాళ్ళతో తొక్కారు. మర్మాంగాల్లో కారం పోశారు. లాఠీలను జొప్పించారు. ఇంకా రాయడానికి వీల్లేనన్ని చిత్రహింసలకు వాళ్ళను గురి చేశారు. అయినా వాళ్ళేమీ చెప్పలేదు. చెప్పడానికి వాళ్ళకేమీ తెలీదు కూడా. నరసింహస్వామిని చంపింది మేమేనని మాత్రం ఒప్పుకున్నారు. రాజేందర్ ఎక్కడుంటాడో వాళ్ళకు

> ఓరోజు తెలతెలవారు
> తుండగా వాళ్ళ ముగ్గుర్నీ
> పోలీసులు జీపులో
> ఎక్కించుకొని ఆ ఊరి
> శివార్లలో ఉండే మామిడి
> తోట దగ్గరకు
> తీసుకొచ్చారు.

నిజంగానే తెలీదు. లక్ష్మీపతి ఎక్కణ్ణుంచి వస్తాడో, ఎక్కడకు వెళ్తాడో కూడా వాళ్ళకు తెలీదు. అందుకే ఎన్నిసార్లు వాళ్ళను గురించి అడిగినా, ఎన్ని చిత్రహింసలు పెట్టినా వాళ్ళు మాకు తెలీదనే చెప్పారు.

మూడు రోజుల తర్వాత ఓరోజు తెలతెలవారుతుండగా వాళ్ళ ముగ్గుర్నీ పోలీసులు జీపులో ఎక్కించుకొని ఆ ఊరి శివార్లలో ఉండే మామిడి తోట దగ్గరకు తీసుకొచ్చారు.

"మీ ముగ్గుర్నీ వదిలేస్తున్నాము. వెళ్ళిపోండ్రి. కమాన్. పరిగెత్తండ్రి" అన్నాడు ఎస్.ఐ.

వాళ్ళు పరిగెత్తే స్థితిలో లేరు. అయినా వాళ్ళలో బతికి బయటపడతామేమోనన్న ఆశ చావలేదు. ఆ ఆశవల్లనే వాళ్ళల్లో కదలిక ప్రారంభమైంది. వాళ్ళు ముగ్గురు జీపు దగ్గర్నుంచి అతి కష్టంగా కొంచెం ముందుకెళ్ళారు.

"ఢాం... ఢాం... ఢాం..." మూడుసార్లు తుపాకులు పేలాయి. మరుక్షణంలో ముగ్గురూ మూడు శవాలుగా మారిపోయారు. ■